


డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు

నరసరావుపేట: రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టాలన్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బుధవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.



నందీశ్వరుడికి అభిషేకాలు

తెనాలి: కార్తిక మాస త్రయోదశి సందర్భంగా గురువారం ప్రదోష కాలంలో కఠెవరంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నందీశ్వరునికి అభిషేకాలు చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1198 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన



నెహ్రూనగర్: వీధి వ్యాపారులు ఫోన్ పే, గూగుల్ పే వంటి వాటి వినియోగంపై డిజిటల్ అక్షరాస్యత పెంచుకోవాలని గుంటూరు జిల్లా ఎల్‌డీఎం రత్నమహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పాత గుంటూరులోని యూనియన్ బ్యాంకులో మెప్మా ఆధ్వర్యంలో పీఎం స్వనిధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలపై దృష్టి సారించాలన్నారు. అవసరమైన రుణాలను అర్హులైన వీధి వ్యాపారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ విజయలక్ష్మి, మెప్మా సీఓ అహ్మద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యడ్ల లింగయ్య కాలనీలో కార్డన్ సెర్చ్

35 వాహనాలు సీజ్, అనుమానితులను ప్రశ్నించిన పోలీసులు



తెనాలి రూరల్: పట్టణ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యడ్ల లింగయ్య కాలనీలో పోలీసులు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో సుమారు 100 మంది పోలీసులు కాలనీలో ప్రతి ఇంటిని సోదా చేశారు. ఇళ్లలో ఉంటున్న వారి వివరాలను తెలుసుకున్నారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. అనుమానితుల వివరాలను నమోదు చేసుకున్నారు. 30 బైక్‌లు, ఐదు ఆటోలకు సరైన పత్రాలు లేకపోవడంతో స్టేషనుకు తరలించారు. పెద్ద సంఖ్యలో పోలీసులు ఒక్కసారిగా కాలనీకి రావడంతో ఏం జరిగిందో తెలియని స్థానికులు ఆందోళనకు గురయ్యారు. జిల్లా ఏఎస్పీ(అడ్మిన్) జీవీ రమణమూర్తి, డీఎస్పీ బి. జనార్దనరావు, త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు పర్యవేక్షించారు. ఏడుగురు రౌడీ షీటర్లు ఉండగా ఐదుగురిని, మరో ఇద్దరు సస్పెక్ట్ షీట్ ఉన్న వాళ్లను అదుపులోకి తీసుకుని విచారించారు. వాహనాల పత్రాలను సమర్పిస్తే తిరిగి అప్పగిస్తామని ఏఎస్పీ రమణమూర్తి తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరు దుర్మరణం



కాకుమాను: ద్విచక్ర వాహనాన్ని ఓ లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందిన దుర్ఘటన పెదనందిపాడు మండలంలోని వరగానిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌చార్జి ఎస్‌ఐ పృథ్వీ ఏకనాథ్ కథనం మేరకు.. వరగాని గ్రామానికి చెందిన తూమాటి శాంసన్ (62), దేవరపల్లి జాన్‌బాబు(14)లు గ్రామంలోని శ్మశాన వాటికలో కూలీ పనులు ముగించుకుని టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో గుంటూరు నుంచి చీరాల వైపు వెళ్తున్న ఏపీ16 ఎక్స్2187 నెంబరు కలిగిన లారీ వీరిని ఢీకొంది. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం తర్వాత డ్రైవరు లారీని ఆపకుండా పారిపోయాడు. చీరాలలో గుర్తించి లారీ డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యార్డుకు 43,722 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 43,722 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 43,251 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 39,427 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

పల్నాటి నుదుటన వీరతిలకం

అంకాలమ్మతల్లి వీరతిలకం దిద్దిందా.. నాగులేరు నవోత్సాహంతో పరవళ్లు తొక్కిందా.. చెన్నకేశవుని గుడిగంట గణగణ మోగుతూ సుస్వాగతమంటూ వీరాచారులకు ఆహ్వానం పలికిందా.. బ్రహ్మనాయుడు ఆయుధం ఉగ్రనృసింహ కుంతలం వీరవిహారానికి కాలుదువ్విందా.. అన్నట్టు పల్నాడు రణక్షేత్రం ఉత్సాహంతో ఉప్పొంగుతోంది. వీరారాధనోత్సవాలకు ముస్తాబై 'సంబర'నాదమై మార్మోగుతోంది.

- రేపటి నుంచి రణక్షేత్రంలో వీరారాధనోత్సవాలు
- ఐదు రోజులపాటు కొనసాగనున్న వేడుకలు
- తరలిరానున్న వీరాచారులు



కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కార్యమపూడి (కారెంపూడి)లో పల్నాటి వీరారాధన ఉత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. కార్తిక అమావాస్య నుంచి ఐదు రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వీరాచారులు వేలాదిగా కారెంపూడి తరలివచ్చి తమ వీరాచారాన్ని నెరవేర్చనున్నారు. పల్నాటి యుద్ధం క్రీ.శ 1182లో జరిగింది. యుద్ధంలో వీరమరణం పొందిన పల్నాటి వీరులను వారి వారసులు ఏటా రణక్షేత్రంలో స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. యుద్ధానంతరం బ్రహ్మనాయుడు నాగులేరు గంగధారి మడుగు ఒడ్డున మృతి చెందిన వీరులకు తర్పణాలు వదిలారు. అప్పటి నుంచి ఏటా వీరులను క్రమం తప్పకుండా స్మరించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. బహుశా ఇవి దేశంలోనే అత్యంత పురాతన ఉత్సవాలు కావచ్చని చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాదీ పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆధ్వర్యంలో వీరాచారులు అత్యంత నిష్ఠతో ఉత్సవాల నిర్వహణకు తరలిరానున్నారు. దీని కోసం చెన్నకేశవుడు, అంకాలమ్మ, వీరుల గుడులను సుందరంగా ముస్తాబు చేశారు. చారిత్రక ప్రదేశాలైన కోట బురుజు, బ్రహ్మనాయుడు మేడను సందర్శకులు తిలకించేందుకు అనువుగా ఏర్పాట్లు జరిగాయి.



బ్రహ్మనాయుడు మేడ

చెన్నకేశవుడు, అంకాలమ్మల సాక్షిగా..

ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబరు నాలుగు వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. పల్నాటి యుద్ధం నాటి ముఖ్యమైన ఐదు చారిత్రక ఘట్టాల పేర్లతో వేడుకలు జరగనున్నాయి. 30న రాచగావు, 1న రాయబారం, 2న మందపోరు, 3న కోడిపోరు, చివరి రోజు 4న కళ్లిపాడు ఉత్సవాలు జరగనున్నాయి. వీరుల ఆయుధాలకు ప్రజలు నీరాజనాలు పలకనున్నారు. చెన్నకేశవస్వామిని, వీర్ల అంకాలమ్మ తల్లిని లక్షలాదిగా ప్రజలు దర్శించుకుని కొలుపులు నిర్వహించనున్నారు. పల్నాటి వీరులు తమ ఆరాధ్య దైవం చెన్నకేశవుడు, ఆరాధ్యదేవత వీర్ల అంకాలమ్మలను 11వ శతాబ్దంలో ప్రతిష్ఠించుకున్నట్టు ప్రతీతి. అందుకే చెన్నకేశవస్వామిని అంకాలమ్మను వీరాచారులు స్మరించుకుంటూ కత్తి సేవలు చేసుకుంటూ గ్రామోత్సవాలు నిర్వహిస్తూ సంప్రదాయ మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. వీరుల గుడిలో రోజూ రాత్రి పల్నాటి చారిత్రక కథలను వీరవిద్యావంతులు ఆలపిస్తారు.



కోట బురుజు



పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అంబటి రాంబాబు తదితరులు

బీసీల అభ్యున్నతికి పూలే ఎనలేని కృషి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

నెహ్రూనగర్: బీసీల అభ్యున్నతికి మహాత్మ జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. గురువారం పూలే వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ పూలే బాటలోనే గత వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. వారు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగితే ఆ కుటుంబం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్ద పీట వేశారన్నారు. ఆనాటి మహనీయుల భావజాలంతో ముందుకు సాగుతున్న పార్టీ తమదని పేర్కొన్నారు. పార్టీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే చరిత్రలో చిరస్మరణీయులుగా నిలిచిపోయారని కొనియాడారు. వెనుకబడిన వర్గాల వారికి వైఎస్ జగన్ పాలనలో అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. 'నా ఎస్సీ, బీసీ, ఎస్టీలని' చెప్పి అక్కున చేర్చుకున్నారని గుర్తుచేశారు. వారికి కొండంత భరోసా కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీ అంటే అన్నివర్గాల పార్టీ అని చెప్పారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ హిందూ కాలేజీ సెంటర్‌లో పూలే విగ్రహం పక్కనే ఆయన సతీమణి సావిత్రి బాయి విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీ నగర అధ్యక్షుడు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బాలసాని కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ పూలే తన జీవితాంతం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికే కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మకాయల రాజనారాయణ, రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాల్‌పురం రాము), మాదిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, రామనబోయిన అజయ్, ఫర్జాన, బత్తుల దేవానంద్, అంగడి శ్రీను, దేవళ్ల వెంకట్, మండేపూడి పురుషోత్తం, కొరిటెపాటి ప్రేమ్‌కుమార్, అగ్గిపెట్టి రాజు, మర్రి సత్యనారాయణ, తుమ్మేటి శ్రీను, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి కుదిరితే మొక్కాల్సిందే!



గుంటూరులోని హరిహర మహల్ థియేటర్ వద్ద సీతమ్మ పాదాలు ఉన్న రావిచెట్టు

- నేటికీ కొరిటెపాడులో పూజలు అందుకుంటున్న సీతమ్మ పాదాలు
- బ్రిటీష కాలానికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నట్లు ప్రచారం
- గతంలో ఈ ప్రాంతం కొరిటెపాడు గ్రామ పొలిమేర



సీతమ్మ పాదాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరం నడిబొడ్డున సీతమ్మ వారి పాదాలు దశాబ్దాలుగా పూజలందుకుంటున్నాయి. కొరిటెపాడు మెయిన్‌రోడ్డులో హరిహర మహల్ థియేటర్ ఎదుట రోడ్డు పక్కన రావిచెట్టు వద్ద వెలిసిన సీతమ్మ పాదాలు బ్రిటీషు కాలానికి పూర్వం నుంచి ఉన్నాయి. ప్రస్తుతం గుంటూరు నగరంలోని ఒక ముఖ్యమైన ప్రాంతంగా ఉన్న కొరిటెపాడు అప్పట్లో ఒక గ్రామంగా ఉండేది. ప్రస్తుత హరిహర మహల్ ప్రాంతం కొన్ని దశాబ్దాలకు పూర్వం కొరిటెపాడు గ్రామ పొలిమేర. సీతమ్మ వారి పాదాలను గ్రామదేవతగా భక్తులు పూజిస్తున్నారు. చరిత్రకు అందని కాలంలోనే ఇక్కడ సీతమ్మ వారి పాదాలు వెలిసినట్లు స్థానికులు చెబుతున్నారు. రావిచెట్టు మొదట్లో ఉన్న సీతమ్మ పాదాలు కాలక్రమేణ నగరం విస్తరించడంతోపాటు రహదారి నిర్మాణ పనులతో రోడ్డును ఆనుకుని ఉన్నాయి. గతంలో ఎటువంటి రక్షణ లేని పరిస్థితుల్లో కొంత కాలం క్రితం చుట్టూ గోడను నిర్మించారు. కొరిటెపాడుతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వివాహం నిశ్చయం అయిన ఆడ పిల్లలను వెంట పెట్టుకుని కుటుంబ సమేతంగా ఇక్కడకు వచ్చి, సీతమ్మ పాదాలకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అలా చేస్తే శుభప్రదం అని నమ్ముతారు. ఇక్కడి రావిచెట్టు దశాబ్దాలుగా అలానే ఉంది. రహదారి విస్తరణ పనుల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం సైతం రావిచెట్టును కదిలించే ప్రయత్నం చేయకుండా దాని పవిత్రతను కాపాడుతున్నారు. రోడ్డును ఆనుకుని ఉన్న సీతమ్మపాదాల చెంత పలువురు సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి తదితర దేవతా విగ్రహాలను తెచ్చి పెడుతున్నారు. దశాబ్దాల ప్రాశస్త్యం గల సీతమ్మపాదాలను పరిరక్షించాల్సిన అవసరముంది.

అధికార పార్టీకి తొత్తులుగా అధికారులు

- ఎంపీపీ తమలపాకుల హెబ్సిబా ఆరోపణ
- ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేదని ఆవేదన



ఎంపీడీవోకు పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ హెబ్సిబా, ప్రజా ప్రతినిధులు

కాకుమాను: అధికార పార్టీ నేతలకు తొత్తులుగా మారి మండల అధికారులు ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఎంపీపీ తమలపాకుల హెబ్సిబా అన్నారు. పెదనందిపాడు మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో గురువారం ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఈ నెల 6వ తేదీన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులందరం అధికార పార్టీ నేతలకు సహకరిస్తామని తెలిపినట్లు ఆమె తెలిపారు. కానీ ఎంపీడీవో మండలానికి మంజూరైన నిధులను కనీసం తమ దృష్టికి తీసుకురాకుండా డ్వాక్రా సభ్యులు (టీడీపీ గ్రూపునకు) వర్క్ ఆర్డర్ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తీర్మానం లేకుండా, కనీసం తన దృష్టికి తీసుకురాకుండా గ్రూపు సభ్యులకు వర్క్ మంజూరు చేయడం అన్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను దళిత ఎంపీపీని కాబట్టే ఎంపీడీవో తన ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజా ప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ నిధులతో గ్రామంలో 7 సీసీ రోడ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు. కానీ ఎమ్మెల్యే ఆదేశాలతో వేరే వారికి అనుమతులు ఇవ్వడం కూడా అన్యాయమని ఆమె తెలిపారు. విషయాన్ని కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, సీఈవోల దృష్టికి తీసుకువెళ్లి తమ హక్కులను కాపాడుకుంటామని పేర్కొన్నారు. న్యాయపోరాటం కూడా చేస్తామని ఆమె తెలిపారు.

ఎంపీడీవో తీరుపై అభ్యంతరం

రోడ్ల నిర్మాణ విషయమై ఎంపీడీవోతో మాట్లాడేందుకు వచ్చిన మండలంలోని ప్రజా ప్రతినిధులకు గంటపాటు ఎంపీడీవో అనుమతి ఇవ్వలేదు. దీనిపై ప్రజా ప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అంత మందితో తాను మాట్లాడబోనని.. ఇద్దరో, ముగ్గురో వచ్చి సమస్యలను తెలపాలని ఎంపీడీవో తమ సిబ్బందితో సమాచారం పంపారు. పోలీస్‌లకు కూడా దీనిపై సమాచారం ఇచ్చారు. దీంతో అసహనానికి గురైన ప్రజా ప్రతినిధులు.. ఎంపీపీ చాంబర్‌లోకి ఎంపీడీవో రావాలని పట్టుబట్టారు. దీంతో గంట తరువాత ఎంపీపీ చాంబర్‌లోకి ఎంపీడీవో వచ్చారు. ఈ వ్యవహారంపై ఎంపీడీవోను ప్రజా ప్రతినిధులు నిలదీశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డ్వాక్రా గ్రూపునకు పనులు మంజూరు చేశానని, అలా చేయడం తప్పేనని ఎంపీడీవో అంగీకరించారు. దీంతో ప్రజాప్రతినిధులు శాంతించారు.

వర్క్ ఆర్డర్ నిలిపివేత

డ్వాక్రా గ్రూపు సభ్యులకు కేటాయించిన పనులను వెంటనే నిలిపివేయాలని ప్రజా ప్రతినిధులు పట్టుబట్టారు. దీంతో వెంటనే ఏఈని పిలిచి, పనులు ప్రస్తుతానికి నిలిపివేయాలని ఎంపీడీవో సూచించారు. నాయకులతో చర్చించిన తర్వాత పనులు ప్రారంభించాలని సూచించారు. మండల ఉపాధ్యక్షుడు కమ్మా సాంబయ్య, పెదనందిపాడు సర్పంచ్ దాసరి పద్మారావు, వైస్ సర్పంచ్ దివి రాంబాబు, అన్నవరం ఎంపీటీసీ సుందరం, కొప్పర్తి ఎంపీటీసీ రమేష్, మండల కో-ఆప్షన్ సభ్యులు మస్తాన్‌వలి తదితరులు ఉన్నారు. అనంతరం ఎంపీడీవోకు పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీపీ హెబ్సిబా, ప్రజా ప్రతినిధులు అందించారు.

కూటమి పాలనలో జీతాలకూ కటకటే!

- అక్టోబర్ నెల వేతనాలు ఇంత వరకు అందని వైనం
- తొలి సారిగా మార్కెట్ కమిటీ ఉద్యోగులకు ఈ దుస్థితి

కొరిటెపాడు(గుంటూరు): వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉద్యోగులకు అక్టోబర్ నెల వేతనాలు ఇంతవరకు అందలేదు. గతంలో వేతనాల చెల్లింపు సకాలంలో జరిగేవి. ఎప్పుడూ లేని విధంగా అక్టోబర్ నెల జీతాలు నవంబర్ నెల పూర్తి కావస్తున్నా అతీగతీ లేకపోవడం పట్ల సర్వత్రా ఆవేదన వ్యక్తం అవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మార్కెట్ కమిటీ ఉద్యోగులదీ ఇదే పరిస్థితి. గుంటూరు జిల్లాలో 8 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఉద్యోగులు ప్రతి నెలా వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై ఒక్క శాతం ఫీజు వసూలు చేస్తున్నారు. ప్రతి కమిటీ రూ.లక్షల్లో ఇలా వసూలు చేస్తుంది. అదే రోజు సీఎఫ్ఎంఎస్ ద్వారా ప్రభుత్వానికి ఈ మొత్తం చేరుతుంది. ప్రభుత్వానికి ఆదాయాన్ని ఇచ్చే వాటిలో మార్కెట్ కమిటీలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత వీరు వేతనాల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. మరో రెండు రోజులు గడిస్తే నవంబర్ నెల వేతనాలు కూడా ఇవ్వాలి. కానీ గత నెల జీతం రాకపోవడంతో ఉద్యోగులు అప్పులు చేయాల్సి వస్తోంది. ఉద్యోగులకు సంబంధించిన పీడీ ఖాతా కూడా ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. 2014 -19 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. నాటి నుంచి మార్కెట్ కమిటీ ఉద్యోగులు సకాలంలో వేతనాలు పొందని పరిస్థితి ఏర్పడింది. మొదటిసారిగా నెల అవుతున్నా జీతాలు రాలేదు. ఉద్యోగులకు సీఎఫ్ఎంఎస్ గ్రీన్ చానల్ ద్వారా చెల్లిస్తారు. నిధులు లేకపోవడం వల్ల వేతనాలు పొందలేకపోతున్నారు.

ఏ-గ్రేడ్ ధాన్యం మద్దతు ధర క్వింటాకు రూ.2,320



గుంటూరు వెస్ట్ : రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు విక్రయించవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ సూచించారు. ఏ-గ్రేడ్ ధాన్యం మద్దతు ధర క్వింటాకు రూ.2,320గా నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో అధికారులు, రైస్ మిల్ యజమానులతో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యానికి కనీసం మద్దతు ధర క్వింటాకు రూ.2,320, కామన్ రకానికి రూ.2,300 అందిస్తుందన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు వెనుకాడనని జేసీ హెచ్చరించారు. సమావేశంలో డీఎస్ఓ కోమలి పద్మ, సివిల్ సప్లైస్ డీఎం లక్ష్మి పాల్గొన్నారు.

బాలిక హత్య కేసులో నిందితుడి పట్టివేత?

- ఐదు నెలలుగా చిక్కని గ్యాస్ డెలివరీ బాయ్
- ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్న పోలీసులు



నాగరాజు (ఫైల్)

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన దళిత విద్యార్థిని హత్య కేసులో నిందితుడైన గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. జూలై 15వ తేదీన జరిగిన పేరుపోగు శైలజ హత్య ఘటన సంచలనం కలిగించింది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న శైలజను అదే ప్రాంతంలో ఉండే నాగరాజు హత్య చేసి పరారయ్యాడు. ఐదు నెలలుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న నిందితుడిని ఎట్టకేలకు అదుపులోకి తీసుకోగలిగారు. పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణ, సిబ్బంది కలిసి రాజమండ్రి సమీపంలో అక్కడి పోలీసుల సహాయంతో రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. కొంతకాలంగా రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో స్పిన్నింగ్, తాపీ పనులు చేసుకుంటూ ఉంటున్నాడని తెలిసింది. నాగరాజుకు గతంలో కూడా నేర చరిత్ర ఉండటంతో సాంకేతిక పరిజ్ఞానానికి కూడా చిక్కకుండా జాగ్రత్తపడ్డాడు. కరోనా సమయంలో చేబ్రోలు ప్రాంతానికి వచ్చి బతుకు దెరువు కోసం హోటల్ కార్మికుడిగా చేరాడు. కొంత కాలానికి గ్యాస్ కంపెనీలో రోజువారీ కూలీగా పనిచేశాడు. కొత్తరెడ్డిపాలెం దళితవాడ ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉండేవాడు. కృష్ణా జిల్లా కొండపల్లికి చెందిన అతడిపై ఆ ప్రాంతంలో హత్య, హత్యాయత్నం కేసులు ఉన్నాయి. పథకం ప్రకారం బాలికను హత్య చేసి రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సంచరించాడు. నాగరాజు అరెస్టును రెండు రోజుల్లో చూపే అవకాశం ఉంది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,000** గరిష్ఠం : రూ. **2,800**

మోడల్ ధర రూ. **2,400**

క్లుప్తంగా

మోడల్ పేపర్ల ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్: ఎస్సెస్సీ, సీబీఎస్‌ఈ టెస్ట్ విద్యార్థుల కోసం నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బిట్ బ్యాంకు, మోడల్ పేపర్లను సంస్థ జిల్లా ఆర్‌జీఎం శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. గురువారం బృందావన్ గార్డెన్స్‌లోని జోనల్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. వీటిని ఉచితంగా అందించనున్నారు. 79898 04937, 99083 13922, 62812 17277, 81790 04459, 81798 80635 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. ఏజీఎంలు హనుమంతరావు, రాజు, రామారావు, రామకృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ సెంటర్లు నెలకొల్పాలి

నగరంపాలెం: డీఈఓ కార్యాలయం (లాగిన్)లో ఫైల్స్ రోజుల తరబడిగా పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బసవలింగారావు, ప్రధాన కార్యదర్శి బసవలింగారావు, మహ్మద్ ఖాలీద్ విన్నవించారు. ఈ మేరకు డీఈఓ సీవీ రేణుకకు గురువారం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. విద్యార్థులకు ప్రత్యేక ఆధార్ సెంటర్లను నెలకొల్పాలని కోరారు.

దేశంలో తొలి సామాజిక తత్వవేత్త పూలే

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలోనే తొలి సామాజిక తత్వవేత్త పూలే అని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా హిందూ కళాశాల సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఆమె నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ.. దేశంలో తొలి సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడు, బడుగు బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించిన మహనీయుడు పూలే అన్నారు. పేదల హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు. మహిళా సాధికారత కల్పనకు కృషి చేసిన గొప్ప వ్యక్తి పూలే అని కొనియాడారు. అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

ఆదర్శనీయుడు పూలే ..

ఏఎన్‌యూ: దేశంలో సామాజిక ఉద్యమాలకు ఎప్పటికీ ఆదర్శనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం పూలే వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ.. యూనివర్సిటీ అధికారులతో కలిసి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుల, జాతి వివక్ష, మహిళల అణిచివేత నిర్మూలనకు పూలే గొప్ప పోరాటం చేశారన్నారు.



నివాళులర్పిస్తున్న వీసీ కె. గంగాధరరావు తదితరులు

రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి , రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం , సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె. వీరయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సురేష్ కుమార్, బాబూ జగ్జీవన్‌రామ్ చైర్ డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్‌లు కూడా పూలే సేవలను కొనియాడారు. పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ప్రిన్సిపల్స్ ఆచార్య పి జాన్సన్, ఆచార్య ఎ ప్రమీలారాణి, బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య మల్లికార్జున, సీడీసీ డీన్ ఆచార్య రవికుమార్, డీఈ వెంకటేశ్వరరావు, సీఈ ఎ. శివప్రసాదరావు, నోడల్ ఆఫీసర్ ఆర్. ప్రకాశరావు, ఉద్యోగ సంఘ నాయకులు ఎస్. నాగేశ్వరరావు, పలువురు అధ్యాపకులు, బీసీ ఉద్యోగ సంఘ నాయకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-నామ్ ద్వారానే మిర్చి క్రయవిక్రయాలు

మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆదేశం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి క్రయవిక్రయాలన్నీ ఈ-నామ్ విధానంలోనే జరగాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత ఆదేశించారు. చుట్టుగుంటలోని మార్కెటింగ్ శాఖ కమిషనరేట్ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో అధికారులతో గురువారం సాయంత్రం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యార్డులో ఈ-నామ్ విధానం అమలు చేయని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యార్డుకు మిర్చి బస్తాలు వచ్చిన వెంటనే లాట్ ఐడీలు గేటు వద్ద జనరేట్ చేయాలని సూచించారు. సాయంత్రం 6 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మాత్రమే దిగుమతులకు అనుమతించాలన్నారు. ఎగుమతి వ్యాపారులు కొనుగోలు చేసిన సరకుకు మధ్యాహ్నం 3 గంటలలోపు బిడ్డింగ్ పూర్తయ్యేలా చూడాలన్నారు. కాపలాదారులు విధిగా ఐడీ కార్డులు, యూనిఫాం ధరించి విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఏ రోజు కొనుగోలు చేసిన మిర్చి బస్తాలు ఆ రోజే బయటకు తరలిపోయేలా చూడాలని ఆదేశించారు. మచ్చు కాయలు తీయడాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. మచ్చు కాయలు తీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యార్డులో జీరో వ్యాపారానికి స్వస్తి పలకాలని, ఎలాంటి బిల్ టు బిల్ వ్యాపారాలను అనుమతించరాదని ఆమె ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ జేడీఏ రాజశేఖర్, జేడీఏ కాకుమాను శ్రీనివాసరావు, డీడీఎం ఝాన్సీరాణి, ఏడీఎం బి.రాజబాబు, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు, యార్డు ఇన్‌చార్జి శ్రీకాంత్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ యశోదర సేవాభావం అభినందనీయం

షారోన్ అవార్డు ప్రదానోత్సవంలో డాక్టర్ డి.శారద

తెనాలి: పవిత్రమైన వైద్యవృత్తిలో సేవాభావంతో పనిచేస్తున్న డాక్టర్ పువ్వాడ యశోదర అభినందనీయులని డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ డి.శారద అన్నారు. పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో షారోన్ స్మారక అంతర్జాతీయ అవార్డు ప్రదానోత్సవం గురువారం సాయంత్రం బుర్రిపాలెంరోడ్డులోని ఎస్ భవనంలో నిర్వహించారు. ఈ పురస్కారాన్ని స్థానిక చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ పువ్వాడ యశోదరకు ప్రదానం చేశారు. సభకు పెన్నీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. డాక్టర్ శారద మాట్లాడుతూ... రోగికి వాస్తవ పరిస్థితి చెప్పి, నిజాయతీగా వైద్యం చేస్తున్న యశోదరను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్ మాట్లాడుతూ పెన్నీ మినిస్ట్రీస్ సేవలను కొనియాడారు. ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.మధుప్రభాకర్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తారని డాక్టర్ యశోదర పేరు తెచ్చుకున్నారని చెప్పారు. మున్సిపల్ ఆరోగ్య విభాగ అధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల మాట్లాడుతూ.. డాక్టర్ యశోదర వైద్యసేవలకు మంచి గుర్తింపు ఉందని గుర్తుచేశారు.



డాక్టర్ యశోదరకు పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

అవార్డు గ్రహీత మాట్లాడుతూ... రోగి దగ్గర తీసుకునే ఫీజుకు తగిన న్యాయం చేయాలని తండ్రి చేసిన సూచనను నిజాయతీగా పాటిస్తున్నానని చెప్పారు. సమస్యను నివారించినప్పుడు బాధితుల కళ్లల్లో కనిపించే ఆనందం తనకు సంతృప్తి ఇస్తుందని వివరించారు. అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. డాక్టర్ ఆలపాటి కృష్ణసందీప్, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి దోనేపూడి మధుబాబు, శ్రీమహాత్మా సేవా శాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి, రోటేరియన్ ఈదర వెంకట పూర్ణచంద్, సినీ దర్శకుడు అచ్చన శ్రీనివాస్ యాదవ్, వేమూరి విజయభాస్కర్, మిలటరీ ప్రసాద్, బెల్లంకొండ వెంకట్ ,అబ్దుల్ హకీం జానీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ వర్సిటీ మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

- ఓవరాల్ చాంపియన్‌గా శివాజీ యూనివర్సిటీ
- రన్నరప్‌గా ఏయూ.. స్ట్రాంగ్ ఉమన్‌గా నిలిచిన ఏఎన్‌యూ లిఫ్టర్ రేణుక

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యాన ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సౌత్, వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు గురువారం ముగిశాయి. పోటీల్లో ఓవరాల్ టీం చాంపియన్‌షిప్‌ను కొల్హాపూర్ శివాజీ యూనివర్సిటీ కైవసం చేసుకుంది. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ రన్నర్స్‌గా నిలిచింది. కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ మూడో స్థానం పొందింది. పోటీల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పీపీఎస్ పాల్‌కుమార్ ఫలితాలను ప్రకటించారు. బెస్ట్ లిఫ్టర్‌గా యూనివర్సిటీ ఆఫ్ ముంబైకి చెందిన లిఫ్టర్ సౌమ్య దాల్వి నిలిచింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లిఫ్టర్ టి.రేణుక స్ట్రాంగ్ ఉమన్ కేటగిరి అవార్డును సొంతం చేసుకుంది. విజేతలకు ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ట్రోఫీలను అందజేశారు.



స్ట్రాంగ్ ఉమన్ ట్రోఫీ అందుకుంటున్న ఏఎన్‌యూ క్రీడాకారిణి టి. రేణుక

క్రీడాకారులకు ప్రోత్సాహం

గుంటూరు ఎడ్యుకేషన్: నూతన క్రీడా విధానాల ద్వారా క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం గుంటూరు కృష్ణనగర్‌లోని లోటస్ ఆద్య పాఠశాల క్రీడా మైదానంలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సహకారంతో ఉన్నత పాఠశాలల జిల్లా స్థాయి త్రోబాల్, కబడ్డీ పోటీలను ముఖ్య అతిథిగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కనపరిస్తే మేథో సంపన్న విద్యార్థులుగా రాణిస్తారన్నారు. బాలానంద కేంద్రం కార్యదర్శి నడింపల్లి గురుదత్ మాట్లాడుతూ లోటస్ ఆద్య విద్యాసంస్థలు సాధారణ విద్యాబోధనకు భిన్నంగా ప్రత్యేక కరికులంతో విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సొసైటీ కార్యదర్శి జీవీఎస్ శివప్రసాద్, బాలానంద కేంద్రం కోశాధికారి జి.సంధ్య శ్రీ, లోటస్ ఆద్య డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ వై.ఉమాదేవి, ప్రిన్సిపాల్ వేణు శ్రీ, పీఈటీ చక్రి, 20 పాఠశాలల నుంచి క్రీడా ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్‌డీఓ నరసింహారెడ్డి

రేపు జిల్లా కోర్టుకు రానున్న హైకోర్టు జడ్జి

నగరంపాలెం: హైకోర్టు జడ్జి, గుంటూరు జిల్లా పరిపాలన జడ్జి జస్టిస్ ఆర్.రఘునందనరావు ఈ నెల 30న గుంటూరు జిల్లా కోర్టుకు రానున్నారు. జిల్లాలోని అన్ని కోర్టుల పనితీరు పరిశీలించి, న్యాయమూర్తులకు పలు అంశాలపై సలహాలు, సూచనలు చేయనున్నారు. జిల్లాలో ఉన్న జ్యుడీషియల్ వ్యవస్థను పరిశీలించనున్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్ హాల్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. గురువారం హైకోర్టు ఆవరణలో జస్టిస్ ఆర్.రఘునందనరావును ది గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి, న్యాయవాదులు కలిసి ఆహ్వానించడంతో ఆయన సానుకూలంగా స్పందించారు.

8 ఇసుక ట్రాక్టర్ల సీజ్



కొల్లిపర: ఎటువంటి అనుమతులు లేకుండా గురువారం ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కృష్ణా నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో 8 ట్రాక్టర్లను పరిశీలించామన్నారు. వారి వద్ద ఎటువంటి వే బిల్లులు లేకపోవడంతో కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ ఇసుక తరలించే వాహనాలకు కూడా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వే బిల్ ఉండాలని తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

- ఫిజికల్ ఎడ్యుకేషన్ రీజినల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ మహబూబ్ బాషా
- వెనిగండ్లలో ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి రగ్బీ స్కూల్ గేమ్స్



పోటీలకు హాజరైన 13 జిల్లాల జట్లు

పెదకాకాని: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా ఆర్ఐపీఈ (రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్) డాక్టర్ మహబూబ్ బాషా అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం, వెనిగండ్ల జిల్లాపరిషత్ హైస్కూల్‌లో గురువారం 68వ రాష్ట్రస్థాయి రగ్బీ స్కూల్ గేమ్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండురోజుల పాటు జరిగే అండర్ 17 బాలుర రగ్బీ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి క్రీడాకారులు వెనిగండ్ల చేరుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం నంబూరు తిరుపతిరావు మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల మధ్య స్నేహసంబంధాలు పెంపొందడమే కాకుండా మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. తొలిరోజు పోటీల్లో సెమీఫైనల్‌కు అర్హత సాధించిన కర్నూలు, గుంటూరు, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు, చిత్తూరు జట్లు శుక్రవారం తలపడతాయి. ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేతలను ప్రకటించడం జరుగుతుందని పాఠశాల పీఈటీ పి.మస్తాన్‌రెడ్డి తెలిపారు. 13 జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు, 40 మంది టెక్నికల్ ఆర్గనైజింగ్ ఆఫీసర్లు హాజరయ్యారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, గుంటూరు రోటరీక్లబ్ ప్రెసిడెంట్ పి.బాలసుబ్రమణ్యం, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, సెక్రటరీ కొండయ్య, పర్యవేక్షకుడు టి.నాగేశ్వరరావు, ఎస్.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు వైద్య కళాశాలకు బస్సుల వితరణ

రోజుల వ్యవధిలో రెండు వాహనాలు అందించిన 1999 బ్యాచ్ విద్యార్థులు

గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల 1999 బ్యాచ్ వైద్య విద్యార్థులు తమ కాలేజీ రుణం తీర్చుకునేందుకు ముందుకు వచ్చారు. తొలి బస్సు కొనుగోలుకు రూ. 40 లక్షలను చెక్కు రూపంలో అందజేశారు. గురువారం మరో బస్సు కోసం రూ. 35.40 లక్షలకు చెక్కును ప్రిన్సిపల్‌కు ఇచ్చారు. బాహుబలి సర్జన్ అయిన ప్రముఖ న్యూరో సర్జన్, గుంటూరు బ్రింద హాస్పటల్ అధినేత డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తొలి బస్సుకు విరాళాలు వచ్చాయి. క్లాస్ రిప్రజెంటేటీవ్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.సునీల్‌కుమార్ నాయక్ చొరవతో రెండో బస్సుకు నగదు సమకూరింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ బస్సు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందిని చెప్పగానే పూర్వ విద్యార్థులు రోజుల వ్యవధిలో రెండు బస్సులకు నగదు అందించడం అభినందనీయం అన్నారు. డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి రూ. 99 లక్షలు విరాళం ఇవ్వాలని తమ బ్యాచ్ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ సునీల్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ అమెరికాలో ఉంటున్న మిత్రులు కూడా వెంటనే స్పందించారని, విరాళాలు ఇచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టర్ సుందరాచారికి చెక్కు అందజేస్తున్న హనుమ శ్రీనివాసరెడ్డి, సునీల్‌కుమార్ నాయక్

విరాళాలు అందజేసిన వైద్యులు...

అమెరికాలో ప్రముఖ వైద్యులుగా సేవలందిస్తున్న సైక్రియాటిస్ట్ డాక్టర్ పుణ్యాల శ్రీనివాసరెడ్డి, నియోనేటాలజిస్ట్ డాక్టర్ దేవరపల్లి మురళీధర్‌రెడ్డి, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్టులు డాక్టర్ కాటూరి రాజశేఖర్, డాక్టర్ ఈదర రవిశంకర్‌రెడ్డి, డాక్టర్ అప్పలనేని శ్రీరామమూర్తి, ట్రినిడాడ్‌కు చెందిన ఇంటెన్సివిస్ట్ డాక్టర్ భీమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు మొదటి బస్సు కొనుగోలుకు రూ. 5 లక్షలు విరాళంగా అందించారు. రెండో బస్సు కొనుగోలుకు అమెరికాకు చెందిన రుమటాలజిస్ట్ డాక్టర్ మల్లిపెద్ది సాహిత్య, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ కాటూరు రాజశేఖర్, హైదరాబాద్‌కు చెందిన ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ యెల్లినేడి, తిరుపతికి చెందిన ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ బాసిరెడ్డి శ్రీక్రాంత్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన ఆప్తమాలజిస్ట్ డాక్టర్ తిమ్మసరతి సదాశివరావు, తెనాలికి చెందిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ యర్రం నరేష్‌రెడ్డిలు విరాళాలు అందజేశారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలి రూరల్: తెనాలి రైల్వే స్టేషన్ తూర్పు బుకింగ్ కౌంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుంది. నల్ల ప్యాంటు, గోధుమ రంగు గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్టు ఎస్ఐ జి. వెంకటాద్రి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27554 లో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ సీపీ వడ్డమాను గ్రామ అధ్యక్షుడి కిడ్నాప్

రెండు గంటల అనంతరం అమరావతి వద్ద పెట్రోల్ బంకులో వదిలిపెట్టిన కిడ్నాపర్లు

తాడికొండ: తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొట్టం వెంకట నరసింహారెడ్డిని గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి కిడ్నాప్ చేశారు. గ్రామంలో కొలుపులు ఉన్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మెలుకువగా ఉన్న నరసింహారెడ్డి తన స్నేహితుడు చుండు వెంకటరెడ్డితో కలిసి కారులో గ్రామ శివారు ప్రాంతానికి వెళ్లగా అక్కడ మాటువేసిన దుండగులు నలుగురు దాడిచేసి మరో కారులో ఎక్కించుకొని అక్కడనుంచి అమరావతి వైపు వేగంగా తీసుకెళ్ళారు. గ్రామస్తులు సమీప ప్రాంతాలలో వెదికి స్థానిక పోలీసులు, జిల్లా ఎస్పీ దృష్టికి కూడా తీసుకెళ్ళడంతో స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీయగా.. రెండు గంటల అనంతరం బాధితుడి ఫోన్ నుంచి కాల్ వచ్చింది. తనను అమరావతిలోని పెట్రోల్ బంకులో వదిలేసి వెళ్లిపోయారని సమాచారం అందించగా హుటాహుటిన పోలీసులు వెళ్లి ఎక్కించుకొని తీసుకొచ్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామానికి చెందిన ఓ జనసేన నాయకుడు తమను కిడ్నాప్ చేయించినట్లు బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తుండగా సీసీ ఫుటేజీల పరిశీలన, పోలీసుల విచారణలో విషయం తేలనుంది.

రేపు ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ డే వేడుకలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ వేడుకలు ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం గురువారం తెలిపారు. వేడుకల్లో 25 మందికి మెమోరియల్ అవార్డులను అందించనున్నట్లు వెల్లడించారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియాలు సంయుక్తంగా ఈ వేడుకలను జర్నలిజం విభాగంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్, లా కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లకు ఈనెల 29న ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్ గురువారం తెలిపారు. ఖాళీ సీట్ల వివరాలు.. ఎంఏ ఇంగ్లిష్ 8, లింగ్విస్టిక్స్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 10, తెలుగు 15, సంస్కృతం 10, హిందీ 10, ఉర్దూ 10, బుద్ధిష్ట్ స్టడీస్ 10, జర్నలిజం 15, సోషియాలజీ 20, సోషల్ వర్క్ 20, రూరల్ డెవలప్‌మెంట్ 15, హిస్టరీ 10, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ 7, పొలిటికల్ సైన్స్ 7, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 10, ఎకనామిక్స్ 15, ఎంకామ్ 17, ఎంఈడీ20, ఎంఎల్ఐఎస్‌సీ 10. ఏపీపీజీ సెట్ రాయని వారు కూడా అర్హులేనని.. వివరాలకు ఏఎన్‌యూ పీజీ అడ్మిషన్ల కార్యాలయాన్ని సంప్రదించాలని చెప్పారు.